
కథ

రాజనందగావ్‌లో విశాఖపట్నం వెళ్లే సమతా ఎక్స్‌ప్రెస్ ఎక్కాను. పగటిపూట ప్రయాణంకదాని రిజర్వేషన్ చేయించలేదు. ఆరోజు జనంతో రైలు కిటకిటలాడుతోంది. కాలు పెట్టడానికి జాగాలేదు. ఎవరెక్కడ దిగుతారో వాకబు చేశాను. ఒకతను రాయపూర్‌లో దిగుతున్నాడని తెలుసుకుని సంతోషపడ్డాను. ఆ సీటుకి దగ్గరలోనే నిల్చున్నాను ఒంటికాలి మీద. అతనూ, అతని ఎదుటిసీటులోని వ్యక్తి రాయపూర్ ఇంకా పదినిమిషాల్లో వస్తుందనగా సీట్లు ఖాళీ చేసి వారి లగేజితో గేటు దగ్గరకు వెళ్లారు. నా బ్రీఫ్‌కేస్‌ను లగేజిరాక్‌మీద పెట్టి చైన్‌లాక్ వేసి సీటులో కూర్చున్నాను. కిటికీ ప్రక్కన సీటు. బొబ్బిలి చేరేవరకు ప్రశాంతంగా కూర్చోవచ్చు.

# ఆచంటి మల్లన్న

స్వామి ప్రసాదరావు




గేటుదగ్గర తొక్కిసలాట మొదలైంది. దిగేవాళ్లను దిగనివ్వరు. ఎక్కేవాళ్లు ఎక్కలేక బాధపడుతున్నారు. ఇంతలో ఎవరో ఒకతను కిటికీలోంచి తన తువ్వాలు నా ఎదుటి సీటులో పడేసి, ఇక తన జాగాకేం ఢోకా లేదన్న సంతోషంతో ఛాయ్‌వాలాను పిలిచి టీ త్రాగుతూ ప్లాట్‌ఫారంమీద అటూఇటూ తిరుగుతున్నాడు.

ఈలోగా చేతితో ఓ సంచి పట్టుకొని ఒకతను పద్మవ్యూహాన్ని అభిమన్యుడు ఛేదించి అందులో ప్రవేశించినట్లు ఎలాగో లోపలికి జొరపడ్డాడు.

అప్పటికి సీట్లన్ని నిండివున్నాయి. నా ఎదుటి సీటులో తువ్వాలుంది. మనిషిలేడు. అతను అక్కడకొచ్చి తువ్వాలు తీశాడు.

"ఆ తువ్వాలు మనిషి క్రింద టీ త్రాగుతున్నాడు. ఆ సీటు అతనిది" అన్నాను.

"అతను ఎక్కడనుంచి వస్తున్నాడు?" సంచిమనిషి అడిగాడు.

"అబ్బే! ఎక్కడనుంచో కాదు. అతను ఇక్కడే ఎక్కుతాడు" అన్నాను.

"అతనబ్బగారి సొంతమా ఈ రైలు. నేను అష్టకష్టాలుపడి ముందు రైలెక్కాను. నింపాదిగా రైలు కదిలేవేళకు ఏ కష్టం లేకుండా ఎక్కాలనుకుంటున్నాడా? మాష్టారూ! మీరేం కల్పించుకోకండి" అని నాతో అని ఆ తువ్వాల్ని ప్లాట్‌ఫారంకి రెండోవైపు రైలుపట్టలుమీదకి విసిరేసి ఆ జాగాలో బాసింపట్టు వేసుకు కూర్చున్నాడు.

మరీ ఇంత దౌర్జన్యమా! నేను నిశ్చేష్టునయ్యాను.

రైలు కదులుతూంటే ఆ వ్యక్తి వచ్చి తన సీటుకోసం అటూఇటూ చూశాడు. ఖాళీ సీట్లేవీ లేవు. చివరకు ఆ సంచీమనిషి దగ్గరకొచ్చి "అయ్యా! ఆ సీటునాది. నా తువ్వాలు కూడా ఉంది" అన్నాడు.

సంచీమనిషి నంగనాచి ముఖం పెట్టాడు. "ఈ సీటు మీదా? ఎక్కడునుంచి వస్తున్నారు. నేను రైలు ఎక్కేటప్పటికి ఇది ఖాళీగా ఉంది. ఏ తువ్వాలూ లేదు. బహుశా మీరు పొరపడుతున్నారు. పక్కది కూడా జనరల్ బోగీయే. బహుశా అందులో ఉందేమో మీ తువ్వాలూ, సీటూ."

"కాదు, కాదు... ఈ ఎర్రచొక్కా తొడుక్కున్న కుర్రాడు, ఆ ముసలాయనా ఉన్న బెర్తుమీద నా తువ్వాలుంచాను."

"అబ్బే! లేదే! కావాలంటే చూడండి" అంటూ లేచాడు. నా సంచికూడా చూపమంటారా?" అన్నాడు అమాయకంగా.

ఆ వ్యక్తి కిందామీద చూశాడు. నేను కాని ఆ ఎర్రచొక్కా కుర్రాడు కాని తనికి సపోర్టుగా మాట్లాడకపోతే, 'బహుశా పక్కబోగేయోనేమో అంటూ గేటు వైపు వెళ్లిపోయాడు.

లోకంలో ఇలాంటి వారూ ఉంటారు. పాపం అతనెంత దూరం వెళ్లాలో! ఇతని వార్నింగ్‌కి జడిసి, అతనికి ఉపకారం చేయకపోవడం సమంజసమా?

రైలు వాయువేగంతో వెళ్తోంది. మా బెర్త్ మీద మరో మనిషి కూర్చోవడంతో నాకు స్థలం కాస్త తక్కువైంది. సంచీమనిషి మాత్రం వీరమఠం వేసుకున్నాడు.

రైలు మహాసముంద్ దాటింది. అతను సంచీని బెర్త్‌మీద పెట్టి లెట్రిన్‌లోకి వెళ్లాడు.

అప్పుడో తమాషా జరిగింది.

ఎవరో ఒకతను రెప్పపాటులో ఆ సంచి పట్టుకుని గేటువైపు వెళ్లాడు.


దొంగా?

పట్టపగలు దొంగతనమా?

దొంగ, పట్టుకోండి అని అరవాలనిపించింది. నా బ్రీఫ్‌కేస్ సురక్షితంగా ఉంది. ఎందుకొచ్చిన తద్దినం అని ఊరుకున్నాను.

ఆ సంచీని తీసుకువెళ్లిన వ్యక్తి ఇప్పుడు బ్రీఫ్‌కేస్‌తో వచ్చి ఆ బెర్త్‌మీద కూర్చున్నాడు. ఇంతకీ ఆ సంచీ ఏమైంది? తువ్వాలుకి పట్టిన గతే దీనికీ పట్టిందా? ఆ సంచీలో ఏమేమున్నాయో?

ఇప్పుడు రామరావణ యుద్ధం జరగడం ఖాయం.




"మాష్టారూ! మీరు పల్లకుండండి. తమాషా చూడండి" అన్నాడతను నాతో. వేషభాషలు బట్టి అతను పెద్దగా చదువుకున్నవాడిలా లేడు. మనిషి బలహీనంగా ఉన్నా గుండె ధైర్యం ఉన్నవాడిలాగున్నాడు. లేకపోతే ఇంతపని ఎలా చేస్తాడు?

బాగ్‌బహారాలో రైలాగింది. ఆ సంచీమనిషి వచ్చాడు. తనసీటులో కొత్తమనిషిని చూసి ఆశ్చర్యపడ్డాడు.

"ఆ సీటు నాది. ఈ సీటు మీద సంచీ కనబడలేదా?"

"సంచీయా? ఏదీ? లేదు" మొండిగా జవాబిచ్చాడు.

అన్యాయాన్ని చూస్తున్నా నేను నోరు మెదపలేకపోయాను. ఆ సీటు అతనిదే అన్నా సంచీ గురించి ఏం చెప్పగలను? పైగా నన్ను నోరెత్తవద్దని అతను హెచ్చరించాడు.

"అమ్మో! నా సంచీనెం చేశారు? అందులో అతిముఖ్యమైన కాగితాలు, నా బట్టలున్నాయి" లబోదిబోమన్నాడు. "రైల్లోంచి గిరాటేశారా?"

"అబ్బో! అంతోటి సాహసం నేనెలా సెత్తాను. నీ అంత ధైర్యం నాకెక్కడిది?"

ఇద్దరూ కొంతసేపు వాదులాడుకున్నారు.

"సూడు బ్రదర్! ఈరైలు నీ సొంతం కాదు. మరొకరి జాగాని జబర్దస్తీగా లాక్కోవడం పెద్దతప్పు."

"అ తప్పు చేసింది నీవు. మరీ నా సంచీనేం చేశావు?"

"నువ్వు రైలెక్కినకాడి నుండి నిన్ను సూస్తానేవున్నాను. నువ్వేంసేసావో నేసూడలేదా? రైల్లో ఏకాధికారం పనికిరాదు. బాసింపట్టు యేసుకుని కూకున్నావు. ఓ ఆడకూతురొచ్చి కాసింత జరుగు అంటే, ఈ సీటు ముగ్గురికే, ఇప్పటికే ముగ్గురం వున్నాం అన్నావు. కాసింత కనికరం సూపలేకపోనావు. నీ సంచీకేం భద్రంగావుంది. ఎల్లు అదిగో ఆ పాయిఖానాలో అద్దంకాడుంది. ఎల్లి తెచ్చుకో. సీటు మాట మరిసిపో."

అతడు పరుగున వెళ్లి సంచీ తెచ్చుకున్నాడు.

అతని ప్రవర్తన నన్ను ఆశ్చర్యచకితుడ్ని చేసింది. తాడితన్నే వాడితల దన్నేవాడంటే ఇలాంటివారినే కాబోలు.

ఏమైతేనేం నేననుమానించినట్లు కొట్లాట జరుగలేదు. కథ సుఖాంతమైంది. నాకు బాత్‌రూంలోనికి వెళ్లాలనిపించింది. తీరా లేస్తే నా సీటు నాకు దొరుకుతుందా?

"ఇంతకీ మీపేరేమిటి? ఏ ఊరెళ్తున్నారు?" అడిగాను.

అతను నా ప్రశ్న విన్నట్లు లేదు. చివరగా కూర్చున్న ముసలాయన భుజం మీద చెయ్యి వేసి "అసింటామల్లు అన్నా" అన్నాడు. ఇప్పుడు ఆ బెర్త్ మీద నాలుగోమనిషికి జాగా అయింది. సంచీమనిషిని తనపక్క కూర్చోపెట్టుకున్నాడు.

ఆసింటమల్లు అన్నా అని అతనంటే ఆచంటిమల్లన్న అన్నట్లు నా కనిపించింది. ఘనుడే! నవ్వుకున్నాను. నిర్భయంగా బాత్‌రూంలోనికి వెళ్లాను.

■